అభిమానాన్ని చూరగొనాలని మావాడి తపన. ఇది తెలుగువాడి వీక్‌నెస్ కూడా. అయినా రాత్రికిరాత్రి ఇంగ్లీష్ రమ్మంటే వస్తుందా; కనుచూపు మేరలో నాక్కూడా ఎలాంటి పరిష్కారం కనపళ్ళేదు. వాణ్ణి బుజ్జగించి పడుకోబెట్టాను. ప్రొద్దున్నే లేచి చూస్తే వాడికళ్ళు ఎర్రగా ఉబ్బివున్నాయి. ఏమిట్రా అంటే...'రాత్రంతా ఆలోచించానురా....డిక్షనరీ ముందేసుక్కూచున్నాను కూడా. 'ఒక్కసారిగా ఇంగ్లీష్ రమ్మంటే వస్తుందా?' అన్నాడు దీనంగా. వాడి పిచ్చికోరికకు నాకు చిర్రెత్తుకొచ్చింది. అయినా రూమ్మేటు కదాని తమాయించుకున్నాను.

వాడి అవస్థ చూస్తే జాలేస్తుంది. అపుడే తటాలున ఓ అయిడియా వచ్చింది.

"ఒరేయ్. నీక్కావల్సింది పార్వతి ముందు నువ్వు ధారాళంగా ఇంగ్లీష్ మాట్లాడటమే కదా. రేపు మాట్లాడుతావు చూడు" అన్నాను ఆనందంగా.

'ఎలారా?' వాడి మొహంలో ఆత్రుత.

'ఇలారా చెప్తాను...మనం ఎగ్జామ్స్ కోసం మన సెకండియర్ ఇంగ్లీష్ నాన్‌డిటైల్ పుస్తకం కూడా ప్రిపేరవుతున్నాం కదా. అందులో చాప్టర్ ఫోర్త్‌లో ప్రకృతి గురించిన ఇద్దరు మిత్రుల వాదన ఉంది కదా. అది ఈ రోజు 'బట్టీ' పడదాం. రేపు పార్వతి, వాళ్ళ స్నేహితురాళ్ళు మనకు కొద్ది దూరంలో ఉండగానే మనం కూడా అది అలాగే (ఇంగ్లీష్‌లో) వాదించుకుంటూ వాళ్ళని దాటుకుంటూ వెళ్తాం....అప్పుడు చూడు మన తడాఖా" అన్నాను నా తెలివికి నేనే ఊగిపోతూ.

నా ఆలోచనకు వాడుకూడా పుబ్బిపోయి రెండు "టిఫిన్స్" కొట్టించాడు.

రాత్రంతా నాన్‌డిటైల్ ఫోర్త్ ఛాప్టర్‌ని బట్టీ పట్టాం...మూడుసార్లు రిహార్సల్స్ చేశాం...ఆ ఛాప్టర్‌లో ప్రభాకర్ వాదించేదే ఎక్కువగా ఉంది. మాట్లాడేటపుడు అమెరికన్ స్టయిల్‌లో సగం మింగమన్నానుకూడా.

మర్నాడు కాలేజీ గ్రౌండ్‌లో పార్వతి అలా వస్తోంది. వెంట మిత్రబృందం కూడా ఉంది. వాళ్ళ దగ్గరయ్యారో లేదో....ఫోర్త్ చాప్టర్‌లోని ఓ వాక్యాన్ని సీరియస్‌గా అన్నాను. మా వాడు గంటకొట్టి నట్టు ఇంగ్లీష్‌లో అరచినంత పని చేశాడు. నేను తర్వాతి వాక్యం అన్నాను. ప్రభాకర్ గాడు అచ్చు ఇంగ్లీష్ బాగా వచ్చిన వాడిలా మాట్లా డేస్తున్నాడు. అలా సీరియస్‌గా ఇంగ్లీష్‌లో మాట్లాడుకుంటూ వాళ్లని దాటేస్తూ వచ్చాము. వస్తూనే నేను క్రీగంట పార్వతిని చూశాను. ప్రభాకర్ గాడి ఇంగ్లీష్ ధాటికి పార్వతి కనురెప్పలు టపటపలాడించి ఆశ్చర్యంగా, ఆనందంగా మావాడివైపు చూసింది. మిగతా వాళ్లుకూడా చిత్రంగా చూశారు మమ్మల్ని.

తర్వాత పీరియడ్‌లో మా వాడికి పార్వతి ఎదురైంది.

"హలో...మీరు ఇంగ్లీష్ బాగా మాట్లాడుతారే" అంది స్టయిల్‌గా. మా వాడు గతుక్కు మన్నాడు. నేను మెల్లిగా పక్కనించి తప్పు కున్నాను.

"అదీ... అదీ... ఏదో" దిక్కులు చూస్తూ నీళ్ల నములుతున్నాడు.

"రియల్లీ...ఐ లైక్‌యూ" అంది. అంతే మా వాడికేక విని ప్రిన్సి పాల్‌కు బీపీ పెరిగిందనుకుంటాను.

ఆరాత్రి వాడు రూంలో నిద్రపోలేదు. "రేపు రోటరీ పార్కుకు 'రమ్మంది' అని లక్షసార్లు అని ఉంటాడు. మర్నాడు తెల్లప్యాంటు మీద బ్లూషర్టు టక్ చేసి నా యాక్షన్ షూస్ వేసుకొని...ప్రక్కవాడి రూంలో ఫారిన్ సెంటు పూసుకొని వెళ్ళాడు. వెళ్ళినవాడల్లా గంటతర్వాత తిరిగి వచ్చాడు. "ఏమైందిరా?" అన్నాను ఉత్సుకతతో.

"నన్ను ప్రేమించిందిరా... కానీ మా ఇంటికి తెలుగులో ఉత్త రాలు రాయొద్దు. అమ్మా నాన్న చదువుతారు. ఇంగ్లీష్ వాళ్లకురాదు.

కాబట్టి ఇంగ్లీష్‌లోనే రాయండి. నాకూ కాస్తా ఇంప్రూవ్ అవుతుంది కదా అంది. అన్నాడు నీరసంగా. అది విని నేనుకూడా దిగాలు పడిపోయాను.

జుట్టంతా పీక్కొంటూ అరగంటకి 'అయిడియా' అన్నాడు వాడు. నేను నోరుతెరిచాను. వాడి బుర్రకు ఆలోచన వచ్చిందంటే అణుబాంబులు కురిసినంత భయం నాకు.

"చూస్కో....ఇంగ్లీష్‌లో రాస్తాను. వాళ్ల అమ్మా నాన్న చదవ కుండా ఇంగ్లీష్‌లోనే లెటర్ రాస్తాను" అన్నాడు అప్పుడే కలం కాగితం తీస్తూ— ఇక నేను బయటికి పోయాను.

రెండు రోజుల తర్వాత పార్వతి వస్తోంటే ఎదురుగా వెళ్ళాడు. ప్రభాకర్‌ని చూస్తూ మొహం చిట్లించి 'డామిట్....బ్లడీ లాంగ్వేజ్' అని తిడుతూ ఓ కాగితం ముద్దని మావాడి మొహాన కొట్టింది. నేను నివ్వెర పోయాను ఇంకేం జరుగుతుందోనని మావాడు క్షణాల్లో ఆ కాగితాన్ని పట్టుకొని పరిగెత్తుకొచ్చాడు. 'ఏమైందిరా!' చికాకుగా అన్నాను.

'నా ఉత్తరం' అంటూ పార్వతి వీడి మొహానికి కొట్టిన కాగితం ఉండని అందించాడు. నేను వాడేం రాసాడా అని గబగబా విప్పాను.

Dear Parvathi,

Ne Premanu Pondina nenu Chala Adrustavantunni. Naku Sariga English radu. Ela raste mee vallaku teliyadu kabatti...

చదువుతుంటే నా బుర్ర తిరిగిపోయింది. ★